పంచవర్ష ప్రణాళికలు... లక్ష్యాలు, వైఫల్యాలు

ఒక వెనుకబడిన దేశం అతి తక్కువ కాలంలో విస్తృత పారిశ్రామిక దేశంగా మారిన వైనాన్ని సోవియట్ రష్యా చరిత్ర ప్రపంచానికి తెలియ జేసింది. ఆర్థిక ప్రణాళికల ద్వారా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల కంటే తక్కువ కాలంలోనే పారిశ్రామికీకరణను సాధించి పన్నెండేళ్లలోనే ప్లవన దశను చేరుకోగలిగింది. అందువల్ల రష్యా ప్రణాళికలు వెనుక బడిన దేశాలకు మార్గదర్శకంగా నిలిచాయి.

ప్రణాళికల ద్వారా రష్యా సాధించిన అభివృద్ధి, 1929లో సంభ వించిన ఆర్థికమాంద్యం, అమెరికాలో రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన 'న్యూడీల్' (New Deal) సంస్కరణలు మన దేశంలోని రాజకీయ వేత్తలను, ఆర్థికవేత్తలను, పారిశ్రామికవేత్తలను ప్రభావితం చేశాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం ప్రణాళికలు– కృషి

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1934లో తాను రచించిన ''ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ – భారతదేశం'' (Planned Economy for India) అనే గ్రంథంలో భారతదేశ ఆర్థికాభివృద్ధి కోసం పదేళ్ల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికను రూపొందించారు.
- మన దేశానికి ప్రణాళికా సంఘం అవసరమని పేర్కొన్న మొట్టమొ దటి జాతీయ నాయకుడు సుభాష్ చంద్రబోస్.
- **1943 బాంబే ప్రణాళిక** – బొంబాయికి చెందిన ఎనిమిది మంది పారిశ్రామికవేత్తల బృందం A Plan for Economic Development అనే పేరుతో ప్రణాళికను రూపొందించింది. దీన్నే బాంబే ప్రణాళిక అంటారు.
- ఎం.ఎన్. రాయ్ ప్రజాప్రణాళిక(Peoples Plan)ను రూపొందిం చారు. ఇది వ్యవసాయం, వినియోగ వస్తు పరిశ్రమలకు ప్రాధా న్యతనిచ్చింది.
- గాంధీ సిద్ధాంతాలను దృష్టిలో ఉంచుకొని శ్రీమన్నారాయణ అగ ర్వాల్ వ్యవసాయానికి, చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యతనిస్తూ గాంధీ ప్రణాళిక రూపొందించారు.
- బ్రిటిష్ ప్రభుత్వం 1944లో సర్ అర్దీషర్ దలాల్ ఆధ్వర్యంలో ప్రణాళిక, అభివృద్ధి శాఖను ఏర్పాటుచేసింది.
- 1946లో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం High Level Advisory Planning Boardను ఏర్పాటు చేసింది.
- స్వాతంత్ర్యం తర్వాత 1950లో జయప్రకాశ్ నారాయణ్ ''సర్వో దయ ప్రణాళిక''ను రూపొందించాడు.

ప్రణాళికా సంఘం

కేంద్ర మంత్రిమండలి తీర్మానం ద్వారా ప్రణాళికా సంఘం మార్చి 15, 1950న ఏర్పడింది. ఇది రాజ్యాంగేతర, శాసనేతర సంస్థ. కేంద్ర ప్రభుత్వానికి ఇది సలహా సంస్థ మాత్రమే. ప్రణాళికా సంఘానికి ఎక్స్ అఫీషియో చైర్మన్ (Ex-officio chairman)గా ప్రధానమంత్రి వ్యవహరిస్తారు. క్రియాశీలకంగా పనిచేసే వాస్తవ కార్యనిర్వాహకు డిగా ఉపాధ్యక్షుడు నియమితుడవుతాడు. ప్రణాళికా సంఘం ప్రస్తుత ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లూవాలియా.

జాతీయాభివృద్ధి మండలి

1952లో ఏర్పడిన రాజ్యాంగేతర సంస్థ జాతీయా భివృద్ధి మండలి. ఇది ప్రణాళికలను పరిశీలించి, ఆమోద ముద్ర వేసిన తర్వాతే అవి అమలవుతాయి. దీనికి కూడా ప్రధానమంత్రి ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

ఇప్పటి వరకు పది పంచవర్ష ప్రణాళికలు పూర్తయ్యాయి. పద కొండో ప్రణాళిక అమల్లో ఉంది.

మొదటి ప్రణాళిక (1951–56)

రెండో ప్రపంచ యుద్ధంతో జరిగిన నష్టం, దేశ విభజనతో ఛిన్నాభిన్నమైన పరిస్థితులను సరిచేయడం, ద్రవ్యోల్బణ ఒత్తిడులను అరికట్టడం, ఆహారధాన్యాలు, ముడిసరుకుల కొరతను తీర్చడం మొదలైన లక్ష్యాలతో మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. ఈ ప్రణాళిక వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ''హరోడ్ –డోమర్'' వృద్ధి నమూనా ఆధారంగా రూపొందింది. వార్షిక వృద్ధి రేటు లక్ష్యం 2.1 శాతం. కాగా వాస్తవంగా సాధించింది 3.6 శాతం. ఈ ప్రణాళిక లక్ష్యసాధనలో విజయం సాధించింది. సింద్రీ ఎరువుల కర్మాగారం, చిత్తరంజన్ లోకోమోటివ్ ఫ్యాక్టరీ, బాక్రానంగల్, దామోదర్ వ్యాలీ, హిరాకుడ్ వంటి ప్రాజెక్టులు, 1952లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పథకం ఈ ప్రణాళికా కాలంలోనే ప్రారంభమ య్యాయి.

రెండో ప్రణాళిక (1956–61)

ఈ ప్రణాళిక భారీ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చింది. దీన్ని పరిశ్రమలు – రవాణా ప్రణాళిక అంటారు. ''మహలనోబీస్ నమూ నా'' ఆధారంగా ఇది రూపొందింది. రూర్కెలా (ఒరిస్సా, పశ్చిమ జర్మనీ సహకారం), బిలాయ్ (చత్తీస్‌గఢ్, రష్యా సహకారం), దుర్గా పూర్ (పశ్చిమబెంగాల్, ఇంగ్లండ్ సహకారం) వంటి ఇనుము–ఉక్కు కర్మాగారాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థకు ''బిగ్‌పుష్'' (Big Push) లభించింది. ఈ కాలంలో ధరలు పెరిగాయి, విదేశీమారక నిల్వల సమస్య ఏర్పడింది. 1960లో సాంద్ర

వ్యవసాయ జిల్లాల కార్యక్రమం ప్రారంభమైంది. లక్ష్య సాధనలో ఈ ప్రణాళిక విఫలమైంది.

మూడో ప్రణాళిక (1961-66)

'అశోక్ మెహతా నమూనా' ఆధారంగా, వ్యవసాయ పరిశ్రమల ఆవశ్యకతను గుర్తించి సంతులన ప్రణాళికగా రూపొందింది. 1962లో చైనాతో, 1965లో పాకిస్తాన్‌తో యుద్ధం, చివరి ఏడాది రుతుపవనాల వైఫల్యం వల్ల లక్ష్యసాధనలో విఫలమైంది. తక్కువ వృద్ధిరేటును నమోదు చేసుకున్న ప్రణాళిక ఇదే. FCI (Food Corporation of India, 1956లో), రష్యా సహకారంతో బొకారో ఉక్కు కర్మాగారం (జార్ఖండ్) ప్రారంభమైంది ఈ ప్రణాళికా కాలంలోనే.

వార్షిక ప్రణాళికలు (1966-69)

వరుస యుద్ధాలు, అనావృష్టి వల్ల నాల్గో ప్రణాళికను ప్రవేశపెట్టే పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో లేకపోవడంతో పంచవర్ష ప్రణాళికలకు విరామం ఏర్పడింది. దాంతో మూడు వార్షిక ప్రణాళికలు అమలయ్యాయి. అందువల్ల ఈ కాలాన్ని ప్రణాళికా విరామం (Plan Holiday) అంటారు. ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన అసమతౌల్యాన్ని సరిచేసి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించడమే వీటి లక్ష్యం. 1966 జూన్‌లో రూపాయి మూల్యహీనీకరణను (డీవాల్యుయేషన్) ప్రభుత్వం చేపట్టింది (మొదటి సారిగా 1949లో). 1966 ఖరీఫ్ సీజన్లో నూతన వంగడాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

నాల్గో ప్రణాళిక (1969-74)

స్థిరత్వంతో కూడిన వృద్ధి, ఆర్థిక స్వావలంబన అనే లక్ష్యాలతో నాల్గో పంచవర్ష ప్రణాళికను డి.ఆర్. గాడ్గిల్ రూపొందించారు. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం, చమురు ధరలు పెరగడం, వాతావరణ ప్రతికూలత వల్ల వృద్ధి లక్ష్యాన్ని సాధించలేదు. ఇందిరాగాంధీ ''గరీబీ హఠావో'' నినాదాన్ని ఈ ప్రణాళికా కాలంలోనే ఇచ్చారు. 1969లో 14 వాణిజ్య బ్యాంకుల జాతీయం, MRTP చట్టం, వర్గీస్ కురియన్ నేతృత్వంలో 1970లలో శ్వేత విప్లవం ప్రారంభం, 1973లో ఫెరా చట్టాన్ని రూపొందించడం ఈ ప్రణాళికా కాలంలో చెప్పుకోదగ్గ సంఘటనలు.

ఐదో ప్రణాళిక (1974-79/78)

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఈ ప్రణాళిక ప్రారంభమైంది. దీని ముసాయిదాను డి.పి. ధర్ రూపొందించారు. జనతా ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల ఏడాది ముందుగానే 1978లో ఈ ప్రణాళిక రద్దయింది. 1975లో ఇందిరాగాంధీ ఇరవై సూత్రాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. కనీస అవసరాల పథకం, పనికి ఆహార పథకం ఈ ప్రణాళికా కాలంలోనే ప్రారంభమయ్యాయి. లక్షిత వృద్ధి కంటే ఎక్కువ వృద్ధిరేటును ఈ ప్రణాళిక సాధించింది.

నిరంతర ప్రణాళిక

1978లో ఐదో పంచవర్ష ప్రణాళికను ఏడాది ముందుగా రద్దుచేసి, 1978-83 కాలానికి నిరంతర ప్రణాళికను జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డి.టి. లకడావాలా దీన్ని రూపొందించారు. 1980లో ఇందిరాగాంధీ ప్రభుత్వం దీన్ని రద్దు చేసి, తిరిగి పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించింది.

ఆరో ప్రణాళిక (1980-85)

ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన, సాంకేతిక స్వావలంబన లక్ష్యాలుగా ఆరో ప్రణాళిక ప్రారంభమైంది. మొదటిసారిగా భారత ఆర్థిక వ్యవస్థ రాజ్‌కృష్ణ పేర్కొన్న హిందూ వృద్ధిరేటును(3.5 శాతం) అధిగమించి 5 శాతంపైగా జాతీయ ఆదాయ వృద్ధిరేటు సాధించింది.

పేదరికంపై ప్రత్యక్ష దాడిచేసిన ప్రణాళిక ఇది. దేశవ్యాప్తంగా IRDP పథకాన్ని 1980లో, NREP 1982లో, DWACRA 1983లో, RLEGP లాంటి పథకాలు ఈ కాలంలో ప్రవేశపెట్టారు. 1982లో నాబార్డు స్థాపన, EXIM Bank స్థాపన ముఖ్యమైనవి.

- Poverty in India గ్రంథ రచయితలు దండేకర్, నీలకంఠ్ రథ్. Planning and the poor గ్రంథ కర్త మిన్హాస్.

ప్రాక్టీస్ బిట్స్

1. మొదటి ప్రణాళిక దేనికి ప్రాధాన్యతనిచ్చింది? (గ్రూప్-2 2000)

ఎ) వ్యవసాయం బి) ఉపాధి కల్పన
సి) పరిశ్రమలు డి) ఎగుమతుల ప్రోత్సాహం

2. వృద్ధితో కూడిన సాంఘిక న్యాయం, సమానత్వం ఏ ప్రణాళికకు సంబంధించింది? (డీఈఓ 2008)

ఎ) ఏడు బి) ఎనిమిది సి) తొమ్మిది డి) పది

3. 'పనికి ఆహార పథకం' ఏ ప్రణాళికా కాలంలో ప్రవేశపెట్టారు? (గ్రూప్-2 2000)

ఎ) ఎనిమిది బి) ఏడు సి) ఆరు డి) ఐదు

4. భారతదేశ ప్రణాళికా రంగంలో జవహర్‌లాల్ నెహ్రూ ఎల్లప్పుడూ దేని అభివృద్ధి గురించి చెబుతూ ఉండేవారు? (గ్రూప్-2 2000)

ఎ) ఉద్యోగ కల్పన బి) వ్యాపారం-వాణిజ్యం
సి) చిన్న పరిశ్రమలు డి) మౌలిక, భారీ పరిశ్రమలు

5. ప్రణాళికా సంఘం ప్రస్తుత అధ్యక్షుడు? (ఏపీపీఎస్సీ 2006)

ఏడో ప్రణాళిక(1985-90)

ఆహారం, పని, ఉత్పాదకతలకు ప్రాధాన్యం ఇస్తూ ఏడో పంచవర్ష ప్రణాళిక 1985లో ప్రారంభమైంది. ముఖ్యంగా ''మహలనోబిస్ వ్యూహాన్ని'' ఈ ప్రణాళికలో అనుసరించలేదు. పారిశ్రామిక రంగానికి తక్కువ, అవస్థాపన సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రాజీవ్‌గాంధీ వ్యూహానికి అనుగుణంగా దిగుమతులు, లైసెన్సులను సరళీకరించారు. ఈ కాలంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా ప్రస్తుత ప్రధాని మన్మోహన్ సింగ్ ఉండేవారు. 1989లో ఎన్ఆర్ఈ, ఆర్ఎల్ఈజీపీ పథకాలను కలిపి జేఆర్‌వై(జవహర్ రోజ్‌గార్ యోజన) అనే ''గ్రామీణ వేతన ఉపాధి పథకం'' ప్రవేశపెట్టారు. అదే ఏడాది పట్టణాల్లో ''నెహ్రూ రోజ్‌గార్ యోజన''ను ప్రారంభించారు. 1987లో ఖాయిలాపడ్డ పరిశ్రమలను పరిశీలించడానికి బీఐఎఫ్ఆర్‌ను, 1988లో స్టాక్ మార్కెట్‌ను నియంత్రించడానికి సెబీని ఏర్పాటు చేశారు. లక్ష్యంగా నిర్దేశించుకున్న వృద్ధిరేటును ఏడో పంచవర్ష ప్రణాళిక అధిగమించింది.

వార్షిక ప్రణాళికలు(1990-92)

రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం, విదేశీమారక నిల్వల కొరత, ద్రవ్యోల్బణం లాంటి సమస్యల వల్ల ఈ రెండేళ్లు వార్షిక ప్రణాళికలు అమలు చేశారు. అందువల్ల ఈ కాలాన్ని ప్రకటించని ప్రణాళికా విరామంగా పిలుస్తారు. 1990లో సిడ్బీ ఏర్పడింది. 1991లో మన్మోహన్ సింగ్ నూతన ఆర్థిక సంస్కరణలు, రాజా చెల్లయ్య పన్ను సంస్కరణలు ప్రారంభమయ్యాయి.

ఎనిమిదో ప్రణాళిక(1992-97)

మానవాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఎనిమిదో ప్రణాళికను 1992లో ప్రారంభించారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్పీజీ) నేపథ్యంలో మనదేశంలో ప్రవేశపెట్టిన మొదటి ప్రణాళిక ఇది. ఈ ప్రణాళిక నుంచే ప్రభుత్వ పెట్టుబడి కంటే ప్రైవేట్ పెట్టుబడి ఎక్కువగా ఉండటం ప్రారంభమైంది. మొదటిసారిగా ప్రణాళిక స్వభావం కేంద్రీకృతం నుంచి సూచనాత్మక ప్రణాళికగా మారింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రారంభమైంది. 1993లో పీఎంఆర్‌వై, ఎంపీలాడ్స్ పథకాలను ప్రారంభించారు. 1994-95లో కరెంట్ అకౌంట్‌లో రూపాయికి పూర్తి మార్పిడి అవకాశం కల్పించారు. 1995-96లో 'నాబార్డ్', 'గ్రామీణ అవస్థాపనా అభివృద్ధి నిధి'ని ప్రారంభించారు. వృద్ధిరేటు లక్ష్యం(5.6శాతం) కంటే ఎక్కువ(6.8 శాతం)గా నమోదైంది.

తొమ్మిదో ప్రణాళిక(1997-2002)

వృద్ధితో కూడిన సాంఘిక న్యాయం, సమానత్వానికి తొమ్మిదో ప్రణాళికలో ప్రాధాన్యమిచ్చారు. ఈ కాలంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ముసాయిదా రూపకర్త మధు దండావతే. ఒరిస్సా వరదలు, కార్గిల్ యుద్ధం వంటి కారణాల వల్ల అనుకున్న వృద్ధిరేటును ఈ ప్రణాళిక సాధించలేదు. 1997లో స్వర్ణజయంతి సహారీ రోజ్‌గార్ యోజన(ఎస్‌జేఎస్ఆర్‌వై), 1998లో కిసాన్ క్రెడిట్ కార్డు పథకం, 2000లో ప్రధానమంత్రి గ్రామోదయ యోజన, 2001లో సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన వంటి పథకాలు పేదరికం నిర్మూలించడానికి ప్రవేశపెట్టారు. నాలుగు శాతం వ్యవసాయ వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ''జాతీయ వ్యవసాయ విధానం-2000''ను ఈ కాలంలోనే ప్రారంభించారు.

పదో ప్రణాళిక (2002-2007)

జనాభా జీవన విధానాన్ని మెరుగుపరచాలనే ఉద్దేశంతో పదో పంచవర్ష ప్రణాళికను ప్రారంభించారు.

నిర్దేశించుకున్న లక్ష్యాలు

- ఎనిమిది శాతం జాతీయాదాయ వృద్ధిరేటును సాధించడం.
- పేదరికం నిష్పత్తిని 2007 నాటికి 5 పాయింట్లు, 2012 నాటికి 15 పాయింట్లు తగ్గించడం.
- 2007 నాటికి అక్షరాస్యతను 75 శాతానికి పెంచడం.
- 2001-11 మధ్య జనాభా వృద్ధిరేటు ప్రస్తుతమున్న స్థితి నుంచి 16.2 శాతానికి తగ్గించడం.
- 2007 నాటికి శిశు మరణాల రేటును 45కి (ప్రతి వేయి మందికి), ప్రసూతి మరణ రేటును 2కి తగ్గించడం.
- అడవుల విస్తీర్ణాన్ని 2007 నాటికి 25 శాతానికి, 2012 నాటికి 33 శాతానికి పెంచడం.

2007 మార్చి 31 నాటికి సాధించిన లక్ష్యాలు

- 7.8 శాతం వృద్ధిరేటును సాధించింది (ఏ ప్రణాళికకైనా అత్యధిక వృద్ధి రేటు ఇదే)
- పెట్టుబడి సగటున 32 శాతం(జీడీపీలో) ఉంది

పంచవర్ష ప్రణాళికల కాలం	ప్రాధాన్యత
మొదటి ప్రణాళిక (1951 ఏప్రిల్ 1-1956 మార్చి 31)	వ్యవసాయాభివృద్ధి
రెండో ప్రణాళిక (1956 ఏప్రిల్ 1-1961 మార్చి 31)	పారిశ్రామికాభివృద్ధి
మూడో ప్రణాళిక (1961-ఏప్రిల్ 1-1966 మార్చి 31)	స్వావలంబన, స్వయంపోషకత్వం
వార్షిక ప్రణాళికలు (1966-69)	
నాలుగో ప్రణాళిక (1969 ఏప్రిల్ 1-1974 మార్చి)	స్థిరత్వంతో కూడిన వృద్ధి, ఆర్థిక స్వావలంబన.
ఐదో ప్రణాళిక (1974 ఏప్రిల్ 1-1979/78 మార్చి 31)	పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన
నిరంతర ప్రణాళిక (1978 ఏప్రిల్ 1-1983 మార్చి 31)	(1980లో రద్దయింది)
ఆరో ప్రణాళిక (1980 ఏప్రిల్ 1 - 1985 మార్చి 31)	ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన
ఏడో ప్రణాళిక (1985 ఏప్రిల్ 1-1990 మార్చి 31)	ఆహారం, పని, ఉత్పాదకత
వార్షిక ప్రణాళికలు (1990 ఏప్రిల్ 1 - 1992 మార్చి 31)	
ఎనిమిదో ప్రణాళిక (1992 ఏప్రిల్ 1-1997 మార్చి 31)	మానవ వనరుల అభివృద్ధి
తొమ్మిదో ప్రణాళిక (1977 ఏప్రిల్ 1-2002 మార్చి 31)	సమానత్వంతో కూడిన వృద్ధి, సాంఘిక న్యాయం
పదో ప్రణాళిక (2002 ఏప్రిల్ 1 -2007 మార్చి 31)	జనాభా జీవన విధానం మెరుగుదల
పదకొండో ప్రణాళిక (2007 ఏప్రిల్-2012 మార్చి 31)	సత్వర, సమ్మిళిత వృద్ధి

- ఎన్ఎస్ఎస్ 61వ రౌండ్ ప్రకారం ఉపాధి వృద్ధి గతం కంటే మెరుగ్గా ఉంది. 1999-2000 నుంచి 2004-05 మధ్య 47 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అయితే పేదరికాన్ని అనుకున్న స్థాయికి తగ్గించలేకపోయారు. వ్యవసాయ వృద్ధిరేటు నాలుగు శాతం లక్ష్యం కాగా 2.1 శాతం మాత్రమే నమోదైంది. శిశుమరణ రేటు, ప్రసూతి మరణరేటు అనుకొన్న స్థాయికి తగ్గలేదు.
- 2004లో ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ రైతు కమిషన్ ఏర్పాటైంది. 2004లో జాతీయ పనికి ఆహారపథకం, 2005లో జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్, 2005- 06లో భారత నిర్మాణ్ పథకం, 2006 ఫిబ్రవరి 2న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించారు.

పదకొండో ప్రణాళిక (2007-2012)

2007 ఏప్రిల్ 1న పదకొండో ప్రణాళిక ప్రారంభమైంది. ''సత్వర సమ్మిళిత వృద్ధి'' దీని లక్ష్యం.

అంశాలవారీ లక్ష్యాలు

ఆదాయం-పేదరికం

- సగటు జీడీపీ వృద్ధి రేటు తొమ్మిది శాతం సాధించటం.
- వ్యవసాయ వృద్ధిరేటు ఏడాదికి నాలుగు శాతం.
- విద్యావంతుల్లో నిరుద్యోగిత ఐదు శాతం కంటే తక్కువగా ఉండేట్లు చూడటం
- ప్రణాళికాంతానికి పేదరికాన్ని 10 పాయింట్లు తగ్గించటం.
- విద్యలో ప్రాథమిక స్థాయిలో డ్రాపౌట్ల రేటును 52 నుంచి 20 శాతానికి తగ్గించడం. ఏడేళ్ల దాటిన వారిలో అక్షరాస్యతను 85 శాతానికి పెంచటం.
- ఆరోగ్యంలో 2012 నాటికి శిశుమరణాల రేటు(ఐఎంఆర్)ను 28కి, ప్రసూతి మరణ రేటును 1కి తగ్గించటం. 2012 నాటికి మొత్తం ప్రత్యుత్పత్తి రేటు 2.1కి తగ్గించటం.
- అవస్థాపనా సదుపాయాలకు సంబంధించి 2009 నాటికి అన్ని బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం, ప్రణాళిక అంతానికి అన్ని గ్రామాలకు టెలిఫోన్ సౌకర్యం కల్పించటం.
- 11వ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వరంగ వ్యయం రూ. 36,44,718 కోట్లుగా అంచనా వేశారు. ఇది పదో ప్రణాళికా వ్యయం (రూ. 16,53,865 కోట్లు) కంటే 125 శాతం ఎక్కువ.
- వ్యవసాయ రంగంలో నాలుగు శాతం, పారిశ్రామిక రంగంలో 10 నుంచి 11 శాతం, సేవారంగంలో 9 నుంచి 11, జాతీయాదాయం తొమ్మిది శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.

స్థూల ఆర్థిక సూచికలు

11వ ప్రణాళికలో జీడీపీలో పెట్టుబడి రేటు 36.7 శాతం, దేశీయ పొదుపు రేటు 34.8 శాతం, కరెంట్ అకౌంట్ లోటు 1.88 శాతం, ఐసీఓఆర్ 4.1 శాతంగా అంచనావేశారు.

రంగాల వారీ వనరుల కేటాయింపు

11వ ప్రణాళికలో అత్యధికంగా 30.3 శాతం సామాజిక రంగానికి కేటాయించారు. శక్తి 23.4 శాతంతో తరువాత స్థానాన్ని ఆక్రమించింది. వ్యవసాయం, నీటిపారుదలకు 18.5 శాతం మాత్రమే కేటాయించారు. వ్యవసాయం, నీటిపారుదలకు 18.5 శాతం మాత్రమే కేటాయించారు.

సాంఘిక సేవలకు సంబంధించి ఎక్కువ శాతం విద్యకు కేటాయించారు. అందువల్ల మన ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ''విద్యా ప్రణాళిక''గా వ్యాఖ్యానించారు. సాంఘిక సేవలు, శక్తిపై అధిక కేటాయింపులు సమ్మతం అయినప్పటికీ పదో ప్రణాళికతో పోలిస్తే 11వ ప్రణాళికలో వ్యవసాయంపై కేటాయింపులు తగ్గడం అనేది వ్యవసాయ రంగంలో నాలుగు శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యానికి సుదూరంగా కన్పిస్తోంది.

PREVIOUS QUESTIONS

1. 11వ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగంలో నిర్దేశించుకొన్న వార్షిక వృద్ధి రేటు? (ఎపీపీఎస్సీ-2007)

ఎ) 5 బి) 4 సి) 3 డి) 5.5

2. ప్రణాళిక సంఘం నిర్వచనం ప్రకారం భారతదేశ దారిద్ర్యరేఖను ఏ విధంగా నిర్ధారించారు? (ఎపీపీఎస్సీ-2007)

ఎ) 1980-81 ధరల ప్రకారం పట్టణ ప్రాంతంలో సాలీన తలసరి ఆదాయం రూ.1800గా, గ్రామీణ ప్రాంతాల్లో సాలీన తలసరి ఆదాయం రూ.1200

బి) తీసుకునే కేలరీల ప్రకారం పట్టణంలో 2100 కేలరీలు, గ్రామాల్లో 2,400 కేలరీలు

సి) ఐదుగురు గల పట్టణ కుటుంబంలో ఇద్దరు ఉద్యోగులుండాలి, గ్రామీణ ప్రాంతాల్లో ఒకరు ఉద్యోగిగా ఉండాలి

డి) 1990-91 ధరల ప్రకారం పట్టణ ప్రాంత సాలీన తలసరి ఆదాయం రూ.3200గా, గ్రామీణ ప్రాంతాల సాలీన తలసరి ఆదాయం రూ.2,800గా నిర్ణయించారు.

3. ఇప్పటి వరకు అత్యధిక వృద్ధి రేటును సాధించిన ప్రణాళిక?

ఎ) మొదటి బి) ఆరో

సి) ఎనిమిదో డి) పదో

4. మహలనోబీస్ వ్యూహం ఏ పంచవర్ష ప్రణాళిక నుంచి మన ప్రణాళికల్లో అనుసరించలేదు? (ఎపీపీఎస్సీ-2007)

ఎ) మూడు బి) ఏడు

సి) తొమ్మిది డి) పది

5. కింది వాటిలో ఏది సరైంది కాదు? (ఎపీపీఎస్సీ-2007)

ఎ) మొదటి ప్రణాళిక(1951-56)

బి) రెండో ప్రణాళిక (1980-85)

సి) మూడో ప్రణాళిక (1966-71)

డి) ఐదో ప్రణాళిక(1974-79)

6. 10వ పంచవర్ష ప్రణాళిక సాలీన వృద్ధిరేటు లక్ష్యం? (ఎపీపీఎస్సీ-2007)

ఎ) ఎనిమిది బి) తొమ్మిది

సి) 10 డి) పైవేవీ కావు

సమాధానాలు

1 బి	2 బి	3 డి	4 బి	5 సి	6 ఎ

ప్రణాళికల వైఫల్యాలు

1. సాంఘిక న్యాయం, సమానత్వ సాధనలో ప్రణాళికలు వైఫల్యం చెందాయి. అట్టడుగున ఉన్న 20% మంది ప్రజల జీవనం మరింత దుర్భరమైనట్లు మరో 20 శాతం ప్రజల జీవనం దాదాపుగా స్థిరంగా ఉన్నట్లు సర్వేలు తెలుపుతున్నాయి. గ్రామీణ పేదరికం ఇప్పటికీ తగ్గలేదు.
2. మానవాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినప్పటికి ఇప్పటికీ మానవాభివృద్ధిలో భారత్ చాలా దేశాల కన్నా వెనుకబడి ఉంది. మానవాభివృద్ధి నివేదిక 2009 ప్రకారం మానవాభివృద్ధిలో భారత్ 134వ స్థానాన్ని పొందడాన్ని బట్టి ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే ప్రధాన కారకమైన మానవాభివృద్ధిలో మన దేశం పూర్తిగా వెనుకబడి ఉందని భావించవచ్చు. విద్య, ఆరోగ్య రంగాలపై పెట్టే పెట్టుబడులు ప్రణాళికా యుగంలో ఆశించిన రీతిలో పెరగలేదు.
3. వ్యవసాయ రంగ వృద్ధిలో ఒడిదుడుకులు పెరిగాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడిన ప్రజల ఆదాయం, ఉపాధి పెరుగుదలకు ఈ రంగం అందించిన తోడ్పాటు తక్కువగా ఉంది. ఇప్పటికి వ్యవసాయ రంగంలో స్వయంసమృద్ధి సాధించబడలేదు. హరిత విప్లవం కేవలం కొన్ని పంటలకే పరిమితమైంది. హరిత విప్లవం వల్ల ప్రాంతీయ అసమానతలు, ఆదాయ అసమానతలు పెరిగాయి.
4. పారిశ్రామిక రంగ అభివృద్ధి కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమిత మైంది. 8వ ప్రణాళిక నుంచి తయారీ రంగ వృద్ధి తగ్గడం వల్ల పారిశ్రామికాభివృద్ధి వృద్ధి కుంటుపడింది.
5. సేవా రంగ కార్యకలాపాలు పట్టణ ప్రాంతాలకే పరిమితమై గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలకు కారణమైంది. జాతీయాదాయంలో 57 శాతం వాటాను కలిగిన ఈ రంగం ఉపాధి కల్పనలో వెనుకబడింది.
6. కోశ విధానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ ఆదాయ వ్యత్యాసాల్లో తేడాను తొలగించలేకపోయాం.
7. శక్తి, రవాణా, స్టీలు, ఎరువుల ఉత్పత్తిలో అనేక లోపాలున్నాయి.